క్లుప్తంగా

సీఎస్ఐ చర్చి ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, బిషప్ జార్జి స్టీఫెన్

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్టలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చిని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, బిషప్ జార్జి స్టీఫెన్‌తో కలసి ప్రారంభించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ ప్రేమ, దయా, కరుణకు ప్రతి రూపమే ఏసుప్రభు అని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆడుగుజాడల్లో నడవలని సూచించారు. అనంతరం ఏసు కీర్తనలను ఆలపించారు.. కార్యక్రమంలో జాన్ సెల్వరాజ్, కల్యాణి, మ్యాతుచ్, అబెల్‌ప్రభు, యాకుబు, రాజీవ్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్స్ నూతన కార్యవర్గం



నూతన కమిటీతో సంఘం సభ్యులు

నగరి: నగరి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కె.అన్నాదురై, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంకర్, వైస్ ప్రెసిడెంట్‌గా వడివేలు, సెక్రటరీగా రవీంద్రబాబు, జాయింట్ సెక్రటరీగా శివకుమార్, ట్రెజరర్‌గా అబూబక్కర్ ఎన్నికయ్యారు.

దళితులను అడ్డుపెట్టుకుని టీడీపీ దగా

వెదురుకుప్పం: దళితులను అడ్డుపెట్టుకుని దగా చేసినట్లు బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ సభ్యుడు కొత్తపల్లె భాస్కర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిప్పినాయుడుపల్లెకు శ్మశాన వాటిక లేదని దాని కోసం పోరాటం చేస్తుంటే శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకున్న వారిని అడగకుండా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి థామస్ దళితులకు అన్యాయం జరుగుతున్నట్లు అసత్యపు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఏ దళితునిడికి ఎక్కడ అన్యాయం జరిగిందో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హోర్ప్స్ ఫౌండేషన్ సంస్థ

గంగాధరనెల్లూరు: హోర్ప్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో రూ.5 లక్షలతో మండల పరిధిలోని వేపంజేరిలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆ సంస్థ వ్యవస్థాపకులు చంటి, సాజన్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామానికి శుద్ధజలం అందించాలనే ఉద్దేశంతో రూ.5లక్షలు వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి చిన్న వేపంజేరి సర్పంచ్ ఝాన్సీలక్ష్మి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హేమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవీ, ఈవోపీఆర్డీ శివయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్రౌపదీ దేవికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: మాతా శిశు మరణాలు అరికట్టాలంటే బాల్యవివాహాలను అరికట్టాలని సర్పంచ్ గాలిమహేష్ బాబు తెలిపారు. ఏఎన్ఎం రేవతి శుక్రవారం అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. సర్పంచ్ గాలి మహేష్ బాబు మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం చేయడం వల్ల ప్రసవం సమయంలో మాతా శిశు మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. అనంతరం అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

జగనన్న పాలనలో రామరాజ్యం

- బాబు పాలనలో కఠిక పేదరికం
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి వ్యాఖ్య



షికారీలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన రామరాజ్యాన్ని తలపిస్తోందని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని తిరుమలయ్యపల్లె గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా షికారికాలనీ, పెద్దబైలు, ఆవుల రెడ్డికండ్రిగ, సుందరాంగిణిపల్లె, కొండకిందపల్లె, గుర్రంవారికండ్రిగ, దేవరగుడిపల్లె, దేవరగుడిపల్లె దళితవాడ గ్రామాల్లో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి పేదవాడు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నారని చెప్పారు. వర్గ వైషమ్యాలను పక్కన పెట్టి నేరుగా లబ్ధి దారుల ఖాతాల్లో నగదును జమ చేస్తున్న క్రమంలో వారి కుటుంబ ఆర్థిక స్థితిగతులు మెరుగుపడుతున్నాయని స్పష్టం చేశారు. చంద్రబాబు రాక్షస పాలనలో పేదలు మరింత పేదరికాన్ని అనుభవిస్తూ కుటుంబ ఆర్థిక స్థితిగతులు మరింత క్షీణించి దయనీయంగా మారినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. బాబు హయాంలో నీరు-చెట్టు ద్వారా పెద్ద ఎత్తున ప్రజా ధనాన్ని లూటీ చేస్తే, సీఎం జగనన్న పాలనలో నాడు-నేడు ద్వారా ఇటు సంక్షేమంలోనూ అటు అభివృద్ధిలోనూ ప్రగతి సాధించినట్లు వివరించారు.

మౌలిక వసతులు కల్పించాలి

సుందరాంగిణిపల్లెలో సిమెంటు నిర్మాణాలతో పాటు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. గ్రామంలో గత ఆరు నెలలుగా బియ్యం ఇవ్వడం లేదని మంత్రి దృష్టికి తీసుకురావడంతో వెంటనే బియ్యం పంపిణీకి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు. పేదల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి వారికి పట్టాలు ఇవ్వాలని సూచించారు. షికారీ కాలనీలో వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని చెప్పారు. తిరుమలయ్యపల్లె జెడ్పీ హైస్కూల్‌కు క్రీడామైదానం కోసం స్థలం కేటాయించాలని మంత్రిని కోరడంతో ప్రభుత్వ భూములను గుర్తించి కేటాయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరుచేయాలని సూచించారు. పాత ఇళ్లను తొలగించి కొత్త ఇళ్లు మంజూరు చేయాలని హౌసింగ్ ఏఈ పృథ్విని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, ఎంపీటీసీలు హరి, చిన్నబ్బ, మునిచంద్రారెడ్డి, ఎంపీడీఓ సుధాకరరావు, సర్పంచ్‌లు భారతి, ఆశీర్వాదం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు పేట ధనంజయరెడ్డి, కోలార్‌ప్రకాష్, రామయ్య, పురుషోత్తం, ఏఎంసీ డైరెక్టర్ గోవింద రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజి, యువత అధ్యక్షుడు నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం



పీర్లపండగ ఉత్సవాల్లో మంత్రి ఆర్కే రోజా

నగరి: ఇస్లాం మత పునరుజ్జీవానికి ప్రాణం పోసిన అమరుల త్యాగాన్ని స్మరించడమే మొహర్రం పండుగ ఉద్దేశమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శుక్రవారం మొహర్రం పండుగను పురస్కరించుకుని పట్టణ పరిధి ప్రకాశం రోడ్డులోని పీర్ల చావడికి ఆమె విచ్చేశారు. ముస్లింలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ముజావర్లు, ముస్లీం సోదరులు పీర్ల వద్ద నమాజ్ చేసి మంత్రిని ఆశీర్వదించి పండుగ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇస్లాం మత పునరుజ్జీవానికి ప్రాణం పోసిన అమరుల త్యాగాన్ని స్మరించడమే మొహర్రం అన్నారు. పవిత్ర యుద్ధంలో వీర మరణం పొందిన ఇమాం హుస్సేన్ త్యాగం వెలకట్టలేనిదని తెలిపారు. ఈ పవిత్రమైన సంతాప దినాలు(పీర్ల పండుగ) హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్, కౌన్సిలర్ బిలాల్, కోఆప్షన్ సభ్యులు హమీద్, చంద్రారెడ్డి, అష్రుఖాన పీర్లచావడి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు



తిరుమలకుప్పంలో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని పరమేశ్వర మంగళం గ్రామంలో హైస్కూల్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ పరమేశ్వరస్వామి బృందం తొలగించింది. తహసీల్దార్ మీడియాతో మాట్లాడుతూ జాతీయ రహదారికి సమీపంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టిన వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అలాగే తిరుమలకుప్పం రెవెన్యూ లెక్క దాఖలలోని సర్వే నెంబర్ 46/1లోని కాలువ బొరంబోకుకు చెందిన 0.56 సెంట్ల భూమిని రైతులు పూర్తిగా ఆక్రమించారని చెప్పారు. సదరు ఆక్రమణ స్థలంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ కూసాలను పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. ఆర్ఎస్‌డీటీ స్వరూపరాణి, వీఆర్‌ఓలు దామోధరం, గురుస్వామి పాల్గొన్నారు.

అంతర పంటగా రాగి సాగు



వేరుశనగలో రాగి సాగును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారిణి హేమలత

కార్వేటినగరం: వేరుశనగలో అంతర పంటగా రాగి సాగు చేయడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారిణి హేమలత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేటలో అంతర పంట రాగి సాగును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అనుకూలంగా ఉన్న పొలాల్లో రాగి పంట సాగు చేయాలని సూచించారు. చీడ పీడ నివారణపై అవగాహన కల్పించారు. రైతులకు రాగి విత్తనాలను పంపిణీ చేశారు. ఏఈవోలు గాయత్రి, హే మాద్రి రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం చొరవతో సీసీ రోడ్డు



ముమ్మరంగా జరుగుతున్న రోడ్డు పనులు

శ్రీరంగరాజపురం: డిప్యూటీ సీఎం నారాయణ స్వామి చొరవతో మండలంలోని పెద్దతయ్యూరు గ్రామానికి సీసీ రోడ్డు ఏర్పాటవుతోందని సర్పంచ్ వరదమ్మ తెలిపారు. ఆమె శుక్రవారం పీఆర్ ఏఈ మునిరాజులతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం సర్పంచ్ మీడియాతో మాట్లాడుతూ, 8లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ గ్రామానికి రోడ్డు వేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించ లేదని గుర్తుచేశారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామానికి సీసీ రోడ్డు, మినరల్ వాటర్ ప్లాంట్, ఆలయం, తాగునీటి బోర్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధి చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమార్, నాయకులు మణి, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మానవ మృగాలను ఉరితీయాలి



అఖిలపక్ష నాయకుల మానవహారం

నగరి: మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడి హత్యలు చేసిన మానవ మృగాలను ఉరితీయాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం టవర్‌క్లాక్ సెంటర్‌లో మానవహారంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని రోజులుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలపై అక్కడి బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గు చేటని మండిపడ్డారు. ఈ సంఘటనలో పాలు పంచుకున్న దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని, ఇందుకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వీరేంద్ర సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేదలకు రక్ష జగనన్న సురక్ష



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ

వెదురుకుప్పం: పేదలకు రక్ష జగనన్న సురక్ష అని ఎంపీపీ నాగరాణి అన్నారు. మండలంలోని పాత గుంటలో శుక్రవారం జగనన్న సరక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు అందని వారు ఏకారణం చేత అందలేదో గమనించి దాని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ, డీటీ కోమల, సర్పంచ్ భువనేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజ్జారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

గంగాధరనెల్లూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని సర్పంచ్ ఝాన్సీ అన్నారు. మండల పరిధిలోని చిన్నవేపంజేరి సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, ఈవోపీఆర్డీ శివయ్య, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



ఊయలలో సేదతీరుతున్న అమ్మవారు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. 7 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను, ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం శ్రీపద్మావతీ అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. అంతర ప్రాకారం ప్రదక్షిణగా అమ్మవారిని ఊరేగించి ఊంజల్ మండపంలో ఊయలలో వేంచేపు చేశారు. వేద, నాద, గాత్ర కచ్చేరీల నడుమ అమ్మవారు ఊయలలో సేదతీరుతుండగా భక్తులు దర్శించి తరించారు.

వైభవం.. పుష్కర కుంభాభిషేకం




ప్రత్యేకాలంకరణలో పిడికిలి గంగమ్మతల్లి, పూజల్లో పాల్గొన్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణం బజారువీధిలో వెలసి ఉన్న పిడికిలి గంగమ్మ ఆలయ పుష్కర కుంభాభిషేకం శుక్రవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 5 గంటలకు దీక్షా హోమాలు, దుర్గాదేవి, శ్రీసూక్త, భూసూక్త, సరస్వతి, సప్తదుర్గా గాయత్రీ, నవగ్రహాది హోమాలతోపాటు జయాది హోమం, పూర్ణాహుతి, కుంభోద్వాసన కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు గోపూజ, ఆలయ ప్రదక్షిణ, త్రిశూలాలకు, మహాద్వారానికి వేదోక్తంగా కుంభాభిషేకం చేపట్టారు. అనంతరం అమ్మవారికి అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా తరఫున ఆమె సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పుత్తూరు శ్మశాన వాటిక సుందరీకరణ



పూల మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి

పుత్తూరు రూరల్: పుత్తూరు శ్మశాన వాటికను వివిధ పూల మొక్కలతో సుందరీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు రూ.1.10 కోట్లతో విద్యుత్ దహన వాటికను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తుదిదశ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గాజులమండ్యంలోని శివానంద ధామం తరహాలో పుత్తూరు శ్మశాన వాటికలో ఆధునిక సౌకర్యాల ఏర్పాటుతో పాటు వివిధ పూల మొక్కలతో సుందరీకరిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రత్యేకంగా వివిధ మొక్కలను తెప్పించినట్లు తెలిపారు. పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపైనా పూల కుండీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా మహిళా వన మహోత్సవం



కార్వేటినగరం: మొక్కలు నాటుతున్న మహిళా ఉద్యోగులు




పాలసముద్రం: మొక్క నాటుతున్న సింగిల్‌విండో అధ్యక్షురాలు జ్యోతి, నగరి: ఎంపీపీ భార్గవి




నింద్ర: మొక్క నాటుతున్న ఎంపీపీ, అధికారులు, వెదురుకుప్పం: ఎంపీపీ నాగరాణి

గంగాధరనెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మహిళా వన మహోత్సవాన్ని శుక్రవారం ఎంపీపీ అనిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల మహిళా అధికారులు మొక్కలు నాటి నీరు పోశారు. ఎంపీడీఓ శ్రీదేవి మాట్లాడుతూ వాతావరణ కాలుష్య నివారణకు మొక్కలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం బుక్కపట్నంగ్రామ సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారిద్దాం

కార్వేటినగరం: మొక్కలు విరివిగా పెంచి కాలుష్యాన్ని అరికట్టేందుకు కృషి చేద్దామని ఉపాధిహామీ ఏపీవో జాహ్నవి పిలుపునిచ్చారు. మహిళా వనమహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎంపీడీవో మోహన్‌మురళీ ఆధ్వర్యంలో చాకలివాని గుంట, మండల కార్యాలయం ఆవరణలో మహిళా సిబ్బంది మొక్కలు నాటి నీరు పోశారు. ఏపీవో మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మహిళా అధికారుల చేత మొక్కులు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో, కార్యాలయాల ఆవరణాల్లో, పొలాల గట్లపై ఫలసాయ మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్ ధనంజయవర్మ, వైద్యాధికారులు, వ్యవసాయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

పాలసముద్రం: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని సింగిల్‌విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి తెలిపారు. శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. జ్యోతి మాట్లాడుతూ వాతావరణ కాలుష్య నివారణకు మొక్కలు పెంచడం ఒక్కటే పరిష్కారమన్నారు. అనంతరం ఆరోగ్య, సచివాలయ సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



గంగాధరనెల్లూరులో..

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

నింద్ర: ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీపీ దీప అన్నారు. శుక్రవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రాంతాల్లో మహిళల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమన్ని ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. ఆమె మాట్లా డుతూ ప్రకృతి మాత్రమే జీవ కోటికి అవసరమైన స్వచ్ఛమైన ప్రాణవాయువును అందిస్తుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. తహశీల్దార్ అమరేంద్రబాబు, ఎంపీడీఓ అరుణ, ఉపాధి ఏపీఓ ఇందుమతి, వెలుగు ఏపీఎం చంద్రకళ, పీఏసీఎస్ చైర్మన్ మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ రక్షణ

నగరి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ రక్షణ సాధ్యమని ఎంపీపీ భార్గవి అన్నారు. శుక్రవారం మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలో ఆమె వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఉపాధిహామీ ఏపీవో కవిత, మహిళలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వెదురుకుప్పం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీపీ నాగరాణి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండకిందపల్లె, వెదురుకుప్పం, పెరుమాళ్లపల్లె గ్రామాల్లో మొక్కలు నాటి నీరు పోశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శిల్ప, శశికుమారి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.